క్లుప్తంగా

ఫ్రైడే - డ్రైడేపై అవగాహన ర్యాలీ



పటమట(విజయవాడతూర్పు): దోమల వల్ల కలిగే వ్యాధుల నుంచి నివారణ కోసం ఫ్రైడే డ్రైడే నిర్వహణతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వీఎంసీ బయాలజిస్ట్ కామేశ్వరరావు అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన నగరంలోని ద్వారకా నగర్, లెక్చరర్స్ కాలనీ, మధురానగర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వీఎంసీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. కార్పొరేటర్ లక్ష్మీపతి, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలోని బీవీ సుబ్బారెడి మున్సిపల్ హైస్కూల్‌లో నాటే మొక్కలకు సంరక్షణ చర్యలు చేపట్టాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అధికారులకు సూచించారు. శుక్రవారం హైస్కూల్‌లోని సదుపాయాలను ఆమె పరిశీలించారు. తరగతి గదుల పరిశుభ్రత, వసతుల కల్పన సక్రమంగా నిర్వర్తించడంపై ప్రధానోపాధ్యాయుడు దుర్గారావుతో మాట్లాడారు. మొక్కల రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని హెచ్‌ఎం కార్పొరేటర్‌ను కోరగా పార్కుల నిర్వహణ అధికారులతో ఆమె మాట్లాడారు.

రహదారులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా రవాణాకు ఆటంకం కలిగించేలా రహదారులను ఆక్రమించిన వ్యాపారులు, వాణిజ్య సంస్థలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మూడవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌చార్జి డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మూడవ ట్రాఫిక్ పోలీసులు, వీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా రహదారుల ఆక్రమణలపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బీఆర్టీఎస్ రోడ్డులో ఆక్రమణలను తొలగించారు. అలాగే ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీకొట్లు, స్టాల్స్‌ను క్రేన్‌ల సాయంతో తరలించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ నగరంలో రవాణా సక్రమంగా సాగేందుకు వ్యాపారులు, వాణిజ్య సంస్థలు అధికారులకు సహకరించాలని కోరారు. ఎస్ఐ జి.వి.ఎస్. కుమార్, వీఎంసీ సర్కిల్–2 టీపీఓ ఎన్.గిరి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ జిలాని పాల్గొన్నారు.

రేపు అమ్మవారి ప్రభ మహోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్‌లో ఈనెల 12వ తేదీ ఆదివారం శ్రీ కనకదుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అమ్మవారి ప్రభ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు కలవకొల్లు వెంకటేశ్వరరావు, నక్కా గోవిందు, గాదె బుజ్జి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభ మహోత్సవం మధురానగర్ పసుపుతోట వాటర్ ట్యాంక్ నుంచి ముత్యాలంపాడు రావిచెట్టు సెంటర్ వరకు బేతాళ సెట్టు, కర్రసాము, డీజే, తీన్‌మార్ నృత్యాలతో సాగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పురోహిత భవన నిర్మాణ పనులు ప్రారంభం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని జీఎస్‌రాజు రోడ్డులో నగరపాలకసంస్థ చేపట్టిన పురోహిత భవన నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శర్వాణీమూర్తి మాట్లాడుతూ గతంలో ఉన్న పురోహిత భవనం ఇరుకుగా ఉండటంతో పురోహితులు వారి దైనందిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడేవారన్నారు. వారి విజ్ఞప్తుల మేరకు రూ. 65 లక్షలతో పురోహితులు యజ్ఞాలు, హోమాలు, ఇతర పూజాదికాలు నిర్వహించుకునేలా అన్ని సదుపాయాలతో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.

హవ్వా.. కారణం ఆర్వోనా..!

- న్యూరాజరాజేశ్వరీపేటలో 'డయేరియా'కు కారణం ఆర్వో వాటర్ ప్లాంట్లేనట
- కౌన్సిల్ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పిన వీఎంసీ కమిషనర్
- నివ్వెరపోతున్న ప్రజలు, బాధితులు



ఆర్‌ఓ ప్లాంట్లకు సరఫరా అయ్యే నీటినే డయేరియా సమయంలో పంపిణీ చేస్తున్న వీఎంసీ సిబ్బంది (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సరిగ్గా నెల రోజుల క్రితం విజయవాడ న్యూరాజరాజేశ్వరీపేట ప్రాంతాన్ని అల్లకల్లోలం చేసిన 'డయేరియా'కు కారణం ఆర్‌ఓ ప్లాంట్లేనంటూ విజయవాడ నగర పాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర కౌన్సిల్ సాక్షిగా బాంబు పేల్చారు. నలుగురు అమాయక ప్రజల ప్రాణాలు బలికొని.. వందల మందిని డయేరియా బారిన పడేసి.. చావు అంచులు దాకా తీసుకువెళ్లిన ఆ నిలువెత్తు నిర్లక్ష్య నెపం తమది కాదంటూ చేతులు దులిపేసుకున్నారు. తమదేమి తప్పు లేదంటూ అక్కడున్న నాలుగు వాటర్ ప్లాంట్లపై నిందను మోపిన ఆయన తీరుపై అటు కార్పొరేషన్ అధికారులు, ఇటు పలు పార్టీల నాయకులు, ప్రజలు, బాధితులంతా నివ్వెరపోతున్నారు.


కమిషనర్‌కు సూటిగా ప్రశ్నల వర్షం

డయేరియాకు కారణం న్యూఆర్‌ఆర్‌పేటలోని నాలుగు వాటర్ ప్లాంట్లేనని.. వాటిలో వచ్చిన నీటి వల్లే సమస్య వచ్చిందని ల్యాబ్ రిపోర్టుల్లో తేలితే మరి డయేరియా సోకిన సమయంలో అక్కడున్న రెండు వాటర్ ప్లాంట్లకు ఏ కంపెనీ అయితే నీటిని సరఫరా చేస్తుందో.. అదే నీటిని మీరు ప్రజలకు తిరిగి ఎలా సరఫరా చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- డయేరియా భారిన పడిన బాధితులెవ్వరూ అసలు ఆ ఆర్వో ప్లాంట్ నీటిని తాగరు. మరి అలాంటప్పుడు వారంతా డయేరియా బారిన ఎలా పడ్డారు.
- ఆర్‌ఓ ప్లాంట్లే కారణమని ల్యాబ్ పరీక్షల్లో తేలితే.. ఆ విషయాన్ని నెల రోజుల పాటు ఎందుకు చెప్పలేదు.. ఆ ప్లాంట్లలో ఏ లోపాలను గుర్తించారు.
- అవే ఆర్వో ప్లాంట్లలో నీటి కలుషితమే జరగలేదని.. అంతా బాగుందని కానూరులోని వీఆర్ సిద్ధార్థ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్ ఇంజినీరింగ్ శాఖ ఎలా సర్టిఫికెట్ ఇచ్చింది.
- న్యూఆర్‌ఆర్‌పేటలోని వాటర్ ట్యాంక్ వద్ద, కుమార్ టీస్టాల్ ఎదురు పార్కులో వేసిన జంబో బోర్ల మోటర్ల ద్వారా ఎటువంటి నిర్ధారణ పరీక్షలు చేయకుండా కార్పొరేషన్ అధికారులు నీటిని సరఫరాను ఎలా చేశారు. డయేరియాకు అవి కారణాలు కాకపోతే డయేరియా బయటపడిన తర్వాత ఆ జంబో బోర్లకు మీరు ఎందుకు సీలు వేయించారు. న్యూఆర్‌ఆర్‌పేటలో ప్రధాన పైపు లైన్ల లీకులను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించి.. కొత్తగా అర కిలో మీటర్ మేర తాగు నీటి పైపులైన్లను మార్చింది నిజం కాదా అని స్థానికులు, బాధితులు కమిషనర్ మీద ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కార్పొరేషన్ కమిషనర్ ఒక బాధ్యత గల అధికారిగా కాకుండా అధికార పార్టీకి చెందిన నాయకుడిలా మాట్లాడినట్లు ఉందని విమర్శిస్తున్నారు.



డయేరియా అనంతరం సీజ్ చేసిన జంబో బోర్లు



కానూరు సిద్దార్థ ఇంజినీరింగ్ శాఖ జారీ చేసిన సర్టిఫికెట్

ఆ నీటినే తాగం



నేను, మా పాప డయేరియా బారినపడి ప్రభుత్వ హాస్పటల్‌లో నరకయాతన అనుభవించాం. అసలు మేము ఆర్‌ఓ ప్లాంట్ నీటినే తాగం. మంచినీటి కొళాయిల్లో నుంచి వచ్చే నీరే తాగుతాం.

– బి.రమణ, బాధితురాలు

మా బావ మృతిచెందారు



మేము మంచినీటి కొళాయిల్లో వచ్చే నీటిని పట్టుకొని తాగడం తప్ప ఆర్‌ఓ ప్లాంట్లలో నీళ్లను అస్సలు కొనము. మా కుటుంబమంతా కొళాయి నీళ్లు తాగే డయేరియా బారినపడ్డాం. మా బావ నరసింహారావు ఈ నీరు తాగే మృతిచెందారు.

– కుమారి, బాధితురాలు

సీజేఐ గవాయ్‌పై దాడి అనాగరిక చర్య

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)పై దాడి అనాగరిక చర్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీజేఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం జాతీయ నాయకుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ దాడిని దేశమంతా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను శిక్షించాలన్నారు. సమావేశంలో హక్కుల సంఘం (సి.ఎల్.సి) రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర నాయకుడు మాల్యాద్రి, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకట్ రెడ్డి, ఎం.సి.పి.ఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్ బాషా, ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు సి.భాస్కరరావు, విరసం నాయకుడు అరసవల్లి కృష్ణ, హనుమంతరావు, ఆల్ ఇండియా లాయర్స్ ఫర్ జస్టిస్ నాయకుడు రాంప్రసాద్, ఏ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్.వి.వి.సత్యనారాయణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకుడు కొండారెడ్డి, పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగాభవాని, ఫోరం ఫర్ డెమోక్రసీ నాయకులు ముషాహర్ బేగ్, హక్కుల సంఘం నాయకులు పిచ్చుక శ్రీనివాసరావు, ఆంజనేయులు, నంబూరు శ్రీమన్నారాయణ, పి.డి.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.రాజేష్, పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ, ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షుడు మునిశంకర్ పాల్గొన్నారు.

నివాసాల మధ్య సెల్‌టవర్ వద్దంటూ ఆందోళన



సెల్ టవర్ నిర్మాణ అనుమతులపై అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఒక బిల్డింగ్‌పైన ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకుని నివాసాల మధ్య ఏర్పాటు చేయ్యవద్దంటూ ఆందోళనకు దిగారు. గత నెలలో రాణా ప్రతాప్‌వీధిలో నీలి సతీష్ అనే వ్యక్తి ఇంటిపైన ఓ ప్రైవేటు సంస్థకు చెందిన సెల్‌టవర్ నిర్మాణం చేపట్టారు. నివాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటుతో తమకు ఆరోగ్య సమస్యలు వస్తాయని, నివాసాల మధ్య నుంచి వాటిని తొలగించాలని స్థానికులు నగరపాలకసంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు తాత్కాలికంగా సెల్‌టవర్ పనులు నిలిపివేశారు. అయితే మళ్లీ శుక్రవారం వారు తిరిగి సెల్‌టవర్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు అడ్డుకోవడంతో నిర్వాహకులు, స్థానికుల మధ్య వాగ్వ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలియడంతో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి అక్కడకు చేరుకుని సర్దిచెప్పడంతో వివాదం కొంతమేర సర్దుమనిగింది. అయితే ఈ ఘటనపై నిర్వాహకులు, స్థానికులు ఒకరిపై ఒకరు ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరువురిని పిలిచి విచారణ చేస్తున్నారు.

• పొంచి ఉన్న ప్రమాదం



స్థానిక 28వ డివిజన్‌లోని సత్యనారాయణపురం సత్రావారి వీధి, రవీంద్రభారతి పాఠశాల సమీపంలో విద్యుత్ ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఫ్యూజ్ బాక్స్ తలుపులు తుప్పుపట్టి పాడైపోయి తెరుచుకుని ఉన్నాయి. ఇక్కడకు అత్యంత సమీపంలోనే రవీంద్ర భారతి, శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది చిన్నారులు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నారులు ప్రమాదవశాత్తూ తాకితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– మధురానగర్ (విజయవాడసెంట్రల్)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు కాలనీ, ఎస్‌జీఓ కాలనీ, రాజీవ్‌నగర్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, డాక్టర్స్ కాలనీ, రాధానగర్, ప్రజాశక్తి నగర్, బర్మా కాలనీ, పాయకాపురం, భగీరథ కాలనీ, ఏపీఎస్ రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, ప్రశాంతి నగర్, శాంతినగర్, దేవినేని గాంధీపురం, కండ్రికలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మధురానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవీంద్రబాబు తెలిపారు. రామకృష్ణాపురం, దేవీనగర్, పసుపుతోట, సాయిబాబా కాలనీ, నేతాజీ కాలనీ, పప్పులమిల్లు ఏరియా, లెక్చరర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలో..

ముత్యాలంపాడు సెక్షన్ అయోధ్యనగర్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ తెలిపారు. కేదారేశ్వరపేట ఒకటో లైన్ నుంచి ఏడో లైన్ వరకు, లోటస్ సెక్టార్ ఒకటి నుంచి సెక్టార్ ఐదు వరకు, రామలింగేశ్వరపేట జీరో లైన్ నుంచి ఏడో లైన్ వరకు, శాంతినగర్, అయోధ్యనగర్, బసవతారక నగర్, బుడమేరు కట్ట ప్రాంతం, సూరిబాబు కాలనీ, డొంక రోడ్డు, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

సింగ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కనకదుర్గనగర్ ఫీడర్‌లో వార్షిక తనిఖీల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీ, నూకాలమ్మగుడి, సెయింట్ ఆన్స్ స్కూల్, స్మైల్ హాస్పటల్, ఆంధ్రప్రతిక కాలనీ, వశిష్ఠ కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మానసిక సమస్యలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ మానస, వేదికపై డాక్టర్ అయోధ్య తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానసిక సమస్యల విషయంలో మూఢనమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథంతో, అవగాహనతో చికిత్స పొంది జీవితాలు బాగుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మానసిక వైద్యురాలు డాక్టర్ మానస కాజ అన్నారు. ప్రపంచ మానసిక వైద్య దినోత్సవం సందర్భంగా సూర్యారావుపేటలోని మానస హాస్పిటల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో మానసిక రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు. ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ అయోధ్య ఆర్.కె. మాట్లాడుతూ ప్రతి 100 మందిలో 15 నుంచి 20 మంది మానసిక అనారోగ్యంతో ఉన్నారన్నారు. ప్రతి 45 సెకన్లకి ఒకరు ఆత్మహత్యల బారిన పడుతున్నట్లు తెలిపారు. డిప్రెషన్, ఉన్మాదం, ఆల్కహాల్, డ్రగ్స్, డిజిటల్ ఎడిక్షన్ బారిన పడుతున్నారని, మానసిక సమస్యలను ముందుగానే గుర్తించి వారికి చికిత్స చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గర్రే శంకరరావు, అమరావతి లేడీస్ సర్కిల్ సింధు, అలేఖ్య తదితరులు ప్రసంగించారు.

కూటమి పాలనలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ పాలనలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించామని గుర్తుచేశారు. నేడు కూటమి పాలనలో పేదలకు ఆరోగ్య భద్రత కరువైందని, నిరుపేదలకు వైద్యం అందించడానికి మీనమేషాలు లెక్కిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ అమలు చేయడం వల్ల ఎక్కడ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతో నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఎంతో మంది ప్రజలు ఆరోగ్యశ్రీ ద్వారా పునర్జన్మ పొందారని గుర్తు చేశారు. అటువంటి ఆరోగ్యశ్రీని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నిర్వీర్యం చేయడం తగదని హితవు పలికారు. పేదల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే తాము సహించబోమని ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మల్లాది విష్ణు హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించి ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

అనుమతి లేనిదే బాణసంచా విక్రయం నిషేధం



బాణసంచా విక్రయదారులకు సూచనలిస్తున్న వీఎంసీ అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగర పాలక సంస్థ అనుమతి లేకుండా దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా విక్రయించకూడదని, వీధి విక్రయదారులు నిర్దేశిత ప్రదేశాలలోనే బాణసంచా విక్రయించాలని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనం మీటింగ్ హాల్లో దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకందారులతో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకందారులు అగ్ని ప్రమాదం జరగకుండా కచ్చితంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని అన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు మాట్లాడుతూ వీఎంసీకి ప్రధానంగా సురక్షితమైన దీపావళి జరుపుకోవడమే ముఖ్యమని, విక్రయదారులు వారి చుట్టుపక్క నివాసులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందికరమైన, ప్రమాదకరమైన వాతావరణం ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగకుండా ఉండాలంటే కేవలం విశాలవంతమైన ఓపెన్ గ్రౌండ్‌లో మాత్రమే బాణసంచా అమ్మటానికి అనుమతిని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ మాట్లాడుతూ వీధి విక్రయదారులు కేవలం నిర్దేశిత ప్రదేశాలలోనే అమ్మకాలు చేయాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, నగర పరిధిలోని బాణసంచా అమ్మకందారులు, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



కేసులను విచారిస్తున్న 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలి లెనిన్ బాబు

పటమట(విజయవాడతూర్పు): రోడ్డుపై చెత్త వేస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలని వీఎంసీ మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలి లెనిన్ బాబు అన్నారు. సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో శుక్రవారం మొబైల్ కోర్టు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన కేసులను ఆయన విచారించారు. మొత్తం 17 కేసులు విచారణ చేయగా వారికి రూ.7980 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలను హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్–2 ప్రభుదాస్, ఏఎంఓహెచ్–2 డాక్టర్ బాబు శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్లు సలీం మహమ్మద్, శివరామ ప్రసాద్, సర్కిల్ –2 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

డయేరియాపై కూటమి ప్రభుత్వం అబద్ధాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ప్రబలిన డయేరియాపై అధికారులతో కూటమి ప్రభుత్వం అబద్ధాలు మాట్లాడిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. శుక్రవారం సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియాతో నెల రోజుల క్రితం నలుగురు మృత్యువాత పడ్డారన్నారు. వందల మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం రాలేదన్నారు. పైగా కార్పొరేషన్ మంచినీటి కాలుష్యం అతిసారకు కారణం కాదని, నాలుగు ప్రైవేట్ ఆర్‌ఓ ప్లాంట్ల నీటి వల్ల ఈ పరిస్థితి వచ్చిందని వీఎంసీ సమావేశంలో ఉన్నతాధికారులు చెబుతూ తప్పును కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాజరాజేశ్వరిపేటలోని అన్ని వీధుల్లో అతిసార రావడం యాదృచ్ఛికమా? అందరూ ఆర్వో ప్లాంట్ నుంచే నీరు తాగారా? వీఎంసీ నీరు కలుషితం కాలేదని ఎలా సర్టిఫికెట్ ఇస్తారు.? నివేదికల్లో ఏముందో వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బాధితులు కార్పొరేషన్ మంచినీరు తాగడం వల్లే అనారోగ్య పాలయ్యామని వాపోతున్నారని అన్నారు. అయితే అధికారుల చేత ప్రభుత్వమే అబద్ధం చెప్పించడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. దీనికి ప్రజాప్రతినిధులు, మున్సిపల్ శాఖ బాధ్యత వహించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో వందలాది మంది ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురైనా ఎంపీ, ఎమ్మెల్యేలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదన్నారు. మృతిచెందిన కుటుంబాలకు రూ. 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి. రమణరావు పాల్గొన్నారు.

అనారోగ్య కారణాలతో వడ్రంగి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అనారోగ్య కారణాలతో వడ్రంగి కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దీనదయాళ్‌నగర్‌కు చెందిన బింక మల్లేశ్వరి, జగ్గారావు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు. జగ్గారావు వడ్రంగి పని చేస్తుంటాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ప్రమాదంలో జగ్గారావుకు తలకు గాయం కాగా వైద్యం చేయించారు. రెండు నెలల కిందట జగ్గారావుకు ఫిట్స్ రావడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా, మద్యం తాగడం మానేయాలని, మందులు క్రమం తప్పకుండా వాడాలని డాక్టర్లు చెప్పారు. అయితే కొద్ది రోజులుగా జగ్గారావు మందులు వేసుకోనని ఇంట్లో గొడవ చేయసాగాడు. శుక్రవారం ఉదయం మల్లేశ్వరి పనికి వెళ్లగా, జగ్గారావు ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. సాయంత్రం 5 గంటల సమయంలో మల్లేశ్వరికి తల్లి ఫోన్ చేసి ఇంట్లో జగ్గారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పింది. ఇంటికి వచ్చి చూసేసరికి రేకుల షెడ్డు రాడ్‌కు చీరతో ఉరి వేసుకున్నట్లు గుర్తించింది. ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.